భక్తులకు ఇబ్బందులు రానివ్వొద్దు


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తలసాని

సనత్‌నగర్: ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పాలక మండలి సభ్యులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ సూచించారు. సికింద్రాబాద్‌లోని గణేష్ టెంపుల్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలండర్‌ను వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి ఎంతో కృషి చేసిందన్నారు. గణేష్ టెంపుల్‌ను కూడా ఎంతో అభివృద్ధి చేసి భక్తులకు అవసరమైన సౌకర్యాలను కల్పించామన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆలయ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని కోరారు.మీ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఓడెల సత్యనారాయణ, సభ్యులు వజీర్ మోహన్, వినోద్, అశోక్, శ్రీశైలం పాల్గొన్నారు.

సందడిగా స్నాతకోత్సవం


సర్టిఫికెట్లు అందుకున్న మేకప్ ఆర్టిస్టులు

సనత్‌నగర్: తమన్నా మేకప్ అకాడమీ స్నాతకోత్సవం సందడిగా జరిగింది. బేగంపేటలోని ఐటీసీ కాకతీయ హోటల్‌లో జరిగిన వేడుకలో మేకప్ ఆర్టిస్టులుగా శిక్షణ పొందిన 60 మంది విద్యార్థులకు డిప్లొమా సర్టిఫికెట్లను అందజేశారు. తమన్నా మేకప్ అకాడమీ వ్యవస్థాపకులు తమన్నా రాజ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ శిల్పారెడ్డి హాజరై మాట్లాడారు. ఫ్యాషన్, మేకప్ రంగానికి ఎంతో డిమాండ్ ఉందని మంచి భవిష్యత్ ఉన్న ఈ రంగంలో నిపుణత సాధించాలన్నారు. మేకప్ ఆర్టిస్టులుగా పట్టాలు పొందిన విద్యార్థులు తమకు తాము ఉపాధి పొందడంతో పాటు మరెందరికో ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు.

ఉత్సాహంగా క్రీడాపోటీలు


స్పోర్ట్స్ డేలో పాల్గొన్న సభ్యులు



లాలాపేట: తార్నాకలోని ఫెయిత్ బాప్టిస్టు చర్చి ఆధ్వర్యంలో మంగళవారం లాలాపేటలోని ప్రొ. జయశంకర్ స్టేడియంలో క్రిస్మస్ వార్షిక క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, ఖోఖో, లెమన్ స్పూన్ వంటి పలు క్రీడా పోటీల్లో చర్చి సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. గత ఐదేళ్లుగా ప్రతి ఏటా క్రిస్మస్ తర్వాతి రోజు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి జనవరి 1న బహుమతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ దయానంద్, ప్రశాంత్, విజయ్, టీనా ప్రశాంత్, సంఘ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజంలో మార్పు

కాచిగూడ: విద్యతోనే సమాజంలో మార్పు వస్తుందని స్వామి శ్రద్ధానంద్ మనుమరాలు మంజుశ్రీ, డాక్టర్ విజయవీర్ విద్యాలంకర్ అన్నారు. స్వాతంత్య్ర సమరయోధుడు పండిట్ గంగారామ్ మెమోరియల్ ఫోరం ఆధ్వర్యంలో స్వామి శ్రద్ధానంద్ 200వ జయంతి వేడుకను ఆర్య కన్యా విద్యాలయ స్కూల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్వామి శ్రద్ధానంద్ తన సంకల్పంలో దృఢంగా ఉండి మహర్షి దయానంద్‌ని కలుసుకోవడం ద్వారా సత్యం పట్ల ఆయనకున్న భక్తితో పాటు అతని జీవితం మారిపోయిందని చెప్పారు. తండ్రి ఆదేశానుసారం మహర్షి దయానంద్ ఉపన్యాసాలు వినడానికి స్వామి శ్రద్ధానంద్ వెళ్లేవాడని, దీంతో అతను మున్షీరామ్ నుంచి స్వామి శ్రద్ధానంద్‌గా మారాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తరామ్, మహేష్ అగర్వాల్, ప్రేమ్ చంద్ మునోత్, సోమనాథ్, దినేష్ సింగ్, రోజా, మనోహర్ సింగ్, రామలత, సవిత, పూజ, భగత్ సింగ్, భగీరథ్ శారద పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహిస్తాం


మాట్లాడుతున్న మణిమంజరి

కవాడిగూడ: జనవరి 3న భారత తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలను రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహిస్తామని పూలే జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్, బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు మణిమంజరి వెల్లడించారు. మంగళవారం దోమలగూడలోని బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా వివిధ రంగాలలో సేవలు అందిస్తున్న మహిళలను సన్మానిస్తామన్నారు. తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలేను ప్రతి మహిళ ఆదర్శంగా తీసుకుని అన్ని రంగాలలో రాణించాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే 600కు పైగా ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా అప్లికేషన్స్ వచ్చాయని వాటన్నింటిని పరిశీలించి, 300 మంది మహిళలను ఎంపిక చేసి వారిని సత్కరించి, సావిత్రి బాయి పూలే అవార్డు, మెమొంటోను అందజేస్తామన్నారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా నాయకురాలు తారకేశ్వరి, సమతాయాదవ్, సంధ్యారాణి, సుజాత, పద్మజ, దేవిక, రేణుక, లావణ్య, పద్మశ్రీ పాల్గొన్నారు.

కార్పొరేట్ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలి

కాచిగూడ: కేంద్రంలోని ప్రజా వ్యతిరేక, కార్పొరేట్‌ల కొమ్ముకాస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తరిమికొట్టేందుకు సిద్ధమవ్వాలని సీపీఐ తెలంగాణ రాష్ట్ర సమితి సభ్యులు బి.వెంకటేశం పిలుపునిచ్చారు. సీపీఐ 99వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మంగళవారం అంబర్‌పేట నియోజకవర్గం సమితి ఆధ్వర్యంలో పార్టీ పతాకావిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీపీఐ బడుగు బలహీన వర్గాల తాడిత, పీడిత ప్రజల కోసం పుట్టిన పార్టీగా భారత దేశంలో గుర్తింపు తెచ్చుకుందన్నారు. రైతులు, కార్మికులు, విద్యార్థి యువత, మహిళల హక్కుల సాధనకై అనేక పోరాటాలు నిర్వహించిందని గుర్తు చేశారు. ప్రజా సమస్యల పట్ల చిత్తశుద్ధితో పోరాడే పార్టీ సీపీఐ పార్టీ మాత్రమే అని పార్టీ నిర్మాణం కోసం ఎంతోమంది ప్రాణాలు త్యాగం చేశారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలనలో దగా పడ్డ ప్రజల కోసం నిరంతరం పోరాటాలు నిర్వహించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కృష్ణమూర్తి, ఓమర్‌ఖాన్, ఎం.శ్రీను, కృష్ణ, లతీఫ్ పాల్గొన్నారు.


ధ్వంసమై తుప్పపట్టిన ఆటవస్తువులు


శిథిలావస్థకు చేరిన కమ్యూనిటీ హాల్

పనికిరాని పార్కులు.. పట్టించుకోని అధికారులు

- డంపింగ్ యార్డుగా భారత్ యూత్ క్లబ్ పార్క్
- వినియోగంలోకి తేవాలంటున్న స్థానికులు
- విస్మరిస్తున్న అధికారులు

ఆహ్లాదాన్ని పంచాల్సిన జీహెచ్‌ఎంసీ పార్కులు నిర్వహణ లేక నిరుపయోగంగా మారిన వైనం తార్నాక డివిజన్‌లో నెలకొంది. పార్కులపై దృష్టి సారించాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో అధ్వానంగా మారుతున్నాయని ఆయా ప్రాంతాల వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తార్నాక మున్సిపల్ డివిజన్ వ్యాప్తంగా పలు కాలనీ, బస్తీల్లోని పార్కులు అధ్వానంగా మారుతుండటంతో వాకర్స్, సందర్శకులు అసహనం వ్యక్తంచేస్తున్నారు. –లాలాపేట

నిర్వహణ లేక..

భారత్ యూత్ క్లబ్ జీహెచ్‌ఎంసీ పార్కు అధికారుల నిర్లక్ష్యానికి గురై నేడు నిరుపయోగంగా మారి జనవాసాల మధ్య డంపింగ్ యార్డుగా దర్శనం ఇస్తుంది. ఇది చాలా కాలం క్రితం నాటి భారత్ యూత్ క్లబ్ పార్కు, జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీ హాల్ అంటే ఎంతో పేరుంది. కానీ జీహెచ్‌ఎంసీ అధికారులు పట్టించుకోకపోవడంతో నిర్వహణ కరువై భూత్ బంగ్లాగా తయారైంది. చుట్టూ పక్కల ప్రాంతాల వారు చెత్త పారవేసే ప్రాంతంగా దీన్ని ఉపయోగించుకుంటున్నారు. పాడైన వాహనాలకు పార్కింగ్ స్థలంగా ఉపయోగపడుతుంది. పిచ్చి మొక్కలతో క్రిమి కీటకాలకు స్థావరంగా మారింది. రాత్రి వేళలో దీని నుంచి దోమలు, క్రిమి కీటకాలు జనవాసాలపైకి వెళుతున్నాయి. లాలాపేట నడిబొడ్డున ఉన్న ఈ పార్కు అభివృద్ధికి నోచుకోకపోవడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తుప్పపట్టిన ఆట వస్తువులు

పార్కు స్థలంలో పిల్లలు ఆడుకోవడానికి, పెద్దలు సేద తీరడానికి ఏర్పాటు చేసిన ఆట వస్తువులు, బెంచీలు పాడై తుప్పుపట్టి కళావిహీనంగా దర్శనం ఇస్తున్నాయి. ఎంతో విలువైన ప్రజాధనం వెచ్చించి నాడు నిర్మాణం చేసిన భారత్ యూత్ క్లబ్ కమ్యూనిటీ హాల్, పార్కు చుట్టూ ఏర్పాటు చేసిన కంచె పాడైంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి భారత్ యూత్ క్లబ్‌కు పునర్ వైభవం తేవాలని లాలాపేట వాసులు కోరుతున్నారు.


హాస్పిటల్ పార్కు దుస్థితిని చూపిస్తున్న సోషల్ వర్కర్ మహేశ్

హాస్పిటల్ పార్కు ఇలా..

లాలాపేటలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని పార్కు పూర్తిగా అధ్వానంగా తయారైంది. హాస్పిటల్‌లోని బాలింతలు, గర్భిణులు, రోగుల సహాయకులు సేద తీరడానికి ఏర్పాటు చేసిన పార్కును ఇటు హాస్పిటల్ అధికారులు, అటు జీహెచ్‌ఎంసీ అధికారులు పట్టించుకోకపోవడంతో ఎందుకు పనికి రాకుండా పోతోంది. పిచ్చి చెట్లు, మొక్కలు ఏపుగా పెరిగాయి. ఇన్ పేషంట్‌గా ఉన్న వారు రాత్రి వేళలో దోమలతో ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఈ పార్కును ఉపయోగించుకోలేక రోగుల సహాయకులు హాస్పిటల్ ముందు రోడ్డు ఫుట్‌పాత్‌పై కూర్చుంటున్నారు. దీనిపై హాస్పిటల్ అధికారులు కానీ, జీహెచ్‌ఎంసీ అధికారులు గాని వెంటనే స్పందించి హాస్పిటల్ పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలనీ స్థానిక సోషల్ వర్కర్ నేతికార్ మహేశ్ డిమాండ్ చేశారు. ఈ విషయమై ఇప్పటికే పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని ఆయన పేర్కొన్నారు.

'వికసిత్ భారత్'ను విజయవంతం చేయాలి


సన్నాక సమావేశంలో పాల్గొన్న బీజేపీ నేతలు

లాలాపేట: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసేందుకు చేపట్టిన వికసిత్ భారత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ నేతలు పిలుపునిచ్చారు. మంగళవారం లాలాపేటలోని ప్రొ. జయశంకర్ స్టేడియం వద్ద ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో పలువురు నేతలు మాట్లాడారు. అర్హులైన ప్రజలందరికి కేంద్ర ప్రభుత్వ పథకాలు అందించాలనే ఉద్దేశంతో దేశ వ్యాప్తంగా బుధవారం ప్రధాని నరేంద్ర మోదీ వికసిత్ భారత్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నారన్నారు. ఆయుష్మాన్ భారత్, ఉజ్వల పథం కింద ఉచిత గ్యాస్ కనెక్షన్ వంటి పథకాలకు ఈ కార్యక్రమం ద్వారా అప్పటికప్పుడే ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేస్తారని పేర్కొన్నారు. ఉదయం 9.30 గంటలకు లాలాపేటలో నిర్వహించే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమానికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరైతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుక్క గణేష్, మేకల సారంగపాణి, నాగేశ్వర్‌రెడ్డి, ప్రకాష్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, పోచయ్య యాదవ్, శ్రీనివాసచారి పాల్గొన్నారు.

మానవ హక్కుల పరిరక్షణకు శ్రమిస్తుంటాం


నియామక పత్రాలను అందజేస్తున్న సంస్థ నాయకులు

అడ్డగుట్ట: మానవ హక్కుల పరిరక్షణ కోసం సంస్థ ఆధ్వర్యంలో నిత్యం శ్రమిస్తూనే ఉంటామని సంస్థ జాతీయ చైర్మన్ మహ్మద్ అబ్దుల్ ఖరీమ్ అన్నారు. లాలాగూడలోని మానవ హక్కుల పరిరక్షణ సంస్థ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి షబానా బేగం నేతృత్వంలో సంస్థ ప్రతినిధులకు నియామక పత్రాలు, ఐడీ కార్డులు అందజేశారు. అనంతరం సంస్థ సభ్యులకు వారికి మానవ హక్కులు వాటి పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షబానా బేగం మాట్లాడుతూ.. మానవ హక్కుల రక్షణ తమ సంస్థ ధ్యేయమని, ఎల్లప్పుడూ ప్రజల్లో ఉంటామన్నారు. ప్రజల హక్కులకు భంగం కలిగితే సహించబోమని, వారి హక్కులను కాపాడడంతో పాటు సామాజిక న్యాయం కూడా చేస్తామన్నారు. సంస్థ ఆధ్వర్యంలో పలు సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సురేష్‌కుమార్, ఖాజా పాషా, చాంద్ పాషా, సమీవుల్లా ఖాన్, అబ్దుల్ ఖలీం, రామలీల, ఫర్హానా బేగం, ఆస్మా బేగం, హాసియా, సాలేహా, ఖైరున్నిసా, అయేషా, షహనాజ్ పాల్గొన్నారు.

పేదలందరికీ సంక్షేమ పథకాలు అందాలి


మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ

ముషీరాబాద్: ప్రభుత్వం అందించే అన్ని రకాల సంక్షేమ పథకాలు పేద ప్రజలందరికి అందించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే అన్ని రకాల సంక్షేమ పథకాలకు రేషన్ కార్డును ప్రాతిపదికన తీసుకోవడంతో రేషన్ కార్డు లేని అనేక వేల పేద కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందకుండా పోయే ప్రమాదం ఉందన్నారు. దాదాపు రాష్ట్రంలో పది లక్షల రేషన్ కార్డు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని మరో రెండు లక్షల మంది దరఖాస్తు చేయని వారు ఉన్నారని వీరందరికి సంక్షేమ పథకాలు దూరమయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. గతంలో ఉమ్మడి కుటుంబాల్లో ఉన్నటువంటి అన్నదమ్ములు, వివాహాలు జరిగి విడిపోయి అద్దె ఇళ్లల్లో ఉంటున్నారని వారందరికి తెల్లరేషన్ కార్డులు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఇవ్వాలని కోరారు. కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోవడానికి ప్రజాపాలనకు ఈ నెల 28 నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని అన్నారని కేవలం వారం రోజుల సమయం వల్ల అందరు దరఖాస్తు చేసుకోలేరని దరఖాస్తు గడువును పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కొల్లూరి వెంకట్, రాజేష్, శాంతికిరణ్, వెంకట్, నక్క రమేష్, బోయ ప్రవీణ్, నాగరాజు పాల్గొన్నారు.

30న లోక్‌అదాలత్

సనత్‌నగర్: ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పెండింగ్ కేసుల పరిష్కారం కోసం ఈ నెల 30న ఏర్పాటు చేసే లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌స్పెక్టర్ రామప్రసాద్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నాంపల్లిలోని క్రిమినల్ కోర్టుల ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ ఏర్పాటు కానున్నదన్నారు. దీని ద్వారా రాజీకి అవకాశం ఉండే క్రిమినల్, పెట్టీ కేసులకు సంబంధించిన ఇరు వర్గాల వివాదాల పరిష్కారం వంటి అవకాశాలు ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

5న మాదిగ ప్రజాప్రతినిధులకు సన్మానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందిన మాదిగ ప్రజా ప్రతినిధులకు జనవరి 5న రవీంద్రభారతిలో సన్మానం చేయనున్నట్లు టీఎస్‌పీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు, ఓయూ పొలిటికల్ సైన్స్ రీసెర్చ్ స్కాలర్ వలిగొండ నరసింహ మంగళవారం పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఆరోగ్యశాఖ మంత్రి రాజనర్సింహా ముఖ్య అతిథులుగా హాజరయ్యే ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి మాదిగ విద్యార్థులతో పాటు రీసెర్చ్ స్కాలర్స్, ప్రొఫెసర్లు, ఉద్యోగులు, జర్నలిస్టులు, కవులు, కళాకారులు, వివిధ ప్రజా సంఘాల నేతలు హాజరవుతారన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.21, నల్లవంకాయ 55, పొడుగు వంకాయ 45, బెండకాయ 55, పచ్చిమిర్చి 50, బజ్జీమిర్చి 55, క్యాప్సికమ్ 65, పచ్చకాకర 71, పందిరిబీర 55, క్యాబేజీ 18, క్యారెట్ 40, దొండ 58, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 75, గోకరకాయ 60, కీర 18, దోసకాయ 35, బీట్‌రూట్ 25, ఉల్లిగడ్డ 20, ఆలుగడ్డ 21, చామగడ్డ 45, మొరంగడ్డ 21, కందగడ్డ 45, సొరకాయ 19, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 4-6, ముల్లంగి 4-6. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

నిరుద్యోగులను మోసం చేసి డబ్బులు వసూలు

ఇద్దరి మధ్య గొడవ.. కేసు నమోదు

రహమత్ నగర్ : శ్రీరామ్‌నగర్‌కు చెందిన నరసింహ బోరబండ ప్రాంతానికి చెందిన సమీర్ అనే వ్యక్తి ఇద్దరు స్నేహితులు. కాగా ఇద్దరు గతంలో ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి పలువురి దగ్గర డబ్బులు వసూలు చేశారు. ఈ క్రమంలోనే నరసింహకు డబ్బులు ఇచ్చిన వ్యక్తులు ఒత్తిడి తీసుకురావడంతో సమీవుల్లాను తిరిగి చెల్లించాలని ఒత్తిడి తీసుకొచ్చారు. మంగళవారం హైటెక్ హోటల్ సైట్-3 ప్రాంతంలోని సమీవుల్లా ఖాన్ ఇంటికి నరసింహ రాగా.. డబ్బుల విషయంలో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. సమీవుల్లాఖాన్ సైపుతో నరసింహపై దాడి చేశాడు. ఈ ఘటనలో అతడి చేతికి గాయమైంది. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో బాధితుడు బోరబండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. చికిత్స నిమిత్తం బాధితుడిని ఆసుపత్రికి తరలించి, నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా దత్త జయంతి వేడుకలు


దత్తజయంతి వేడుకల్లో పాల్గొన్న మాజీ మేయర్ కార్తీకచంద్రారెడ్డి

చిలకలగూడ : సీతాఫల్‌మండి దత్తాత్రేయస్వామి ఆలయంలో దత్త జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని పుష్పాలతో అలంకరించి అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. దత్త జయంతి వేడుకలకు మాజీ మేయర్ బండా కార్తీకచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. చిలకలగూడ వీరాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలోని దత్తాత్రేయ మందిరంలో దత్త జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రతినిధి రవికాంత్, నాయకులు రాము, వీరన్న, సాయి, లడ్డు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ సిప్లిగంజ్ సందడి



లాలాపేట: సింగర్ రాహుల్ సిప్లిగంజ్ తార్నాకలో సందడి చేశారు. సోమవారం రాత్రి తార్నాకలోని స్పోర్ట్స్ స్క్వేర్‌లో బియాండ్ ద ట్రీ కెఫే అండ్ రెస్టారెంట్ ప్రారంభోత్సవానికి హాజరయ్యారు . ఈ సందర్భంగా రాహుల్ నాటు నాటు సాంగ్‌కు స్టెప్పు లేసి అలరించారు. హైదరాబాద్ బిర్యానీ ఎంతో ఫేవరేట్ అని ఇది తార్నాక వాసుల చెంతకే రావడంతో ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఇంద్రసేనారెడ్డి, సందీప్‌రెడ్డి, కృష్ణ చైతన్య, మృదుల, సుతకీర్తిరెడ్డి,సుశీల్, మౌనిక, సాయిరాంరెడ్డి పాల్గొన్నారు.

పార్లమెంట్ మార్చ్‌ను విజయవంతం చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: జనవరి 12న జరిగే పార్లమెంట్ మార్చ్ ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు, ఓయూ పీహెచ్‌డీ విద్యార్థి ఆర్‌ఎల్ మూర్తి మంగళవారం పేర్కొన్నారు. సేవ్ ఎడ్యుకేషన్, నూతన జాతీయ విద్యా విధానం రద్దు, సేవ్ ఇండియా, బీజేపీని గద్దె దించండి అనే నినాదంతో జాతీయ స్థాయిలో 16 సెక్యులర్ విద్యార్థి సంఘాల పిలుపు మేరకు చలో ఢిల్లీ కార్యక్రమంలో భాగంగా పార్లమెంట్ మార్చ్ చేపట్టినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం నుంచి సుమారు 500 మంది విద్యార్థి నాయకులు హాజరు కానున్నట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం



సనత్‌నగర్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి ఆలయంలో మంగళవారం చండీహోమం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని చండీహోమం పూజ జరిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

'6 గ్యారంటీ'లపై సమీక్ష సమావేశం



సాక్షి, సిటీబ్యూరో: కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డులోని సితార హోటల్‌లో మంగళవారం జరిగిన సమీక్ష సమావేశంలో నగర సీనియర్ నాయకులు బేగంపేట రమేష్ పాల్గొని మాట్లాడారు. ఈ నెల 28 నుంచి అర్హులంతా ఆరు గ్యారంటీలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు భరత్, నరేష్ ముదిరాజు ,మధునాల పద్మన్న, టీ విజయ్ కుమార్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

అత్తింటి వేధింపులతో వివాహిత ఆత్మహత్య

చిలకలగూడ: అత్తింటి వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ మట్టంరాజు వివరాల ప్రకారం.. పద్మారావునగర్‌కు చెందిన దివ్య(29)కు మలక్‌పేటకు చెందిన అభిషేక్‌తో ఈ ఏడాది ఫిబ్రవరిలో వివాహమైంది. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అభిషేక్‌తో కలిసి ఏప్రిల్‌లో అమెరికా వెళ్లిన దివ్య భార్యాభర్తల మధ్య అభిప్రాయభేదాలతో మే నెలలో ఇండియాకు వచ్చి తల్లిదండ్రులతో కలిసి పద్మారావునగర్‌లో ఉంటుంది. ఈ నెల 25న దివ్య తల్లి తండ్రులతో కలిసి భోజనం చేసి తన గదికి వెళ్లింది. మంగళవారం ఉదయం ఎంతసేపైనా బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చి తలుపులు విరగొట్టి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకుని ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. భర్త అభిషేక్, ఆయన తల్లిదండ్రులు, బంధువులు వేధింపులు తట్టుకోలేకే ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతురాలి తండ్రి సంతోష్‌కుమార్ ఫిర్యాదులో పేర్కొన్నాడు.

స్వాతంత్య్ర పోరాటంలో కమ్యూనిస్టుల పాత్ర కీలకం

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి

హిమాయత్‌నగర్: స్వాతంత్య్ర పోరాటంలో కమ్యూనిస్టుల పాత్ర కీలకంగా ఉందని, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. దేశంలోని ప్రతి పౌరుడికి అధికారం కల్పించే భారత రాజ్యాంగాన్ని రూపొందించడానికి రాజ్యాంగ పరిషత్ డిమాండ్‌ను లేవనెత్తింది సీపీఐ పార్టీయేనని తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) 99వ వ్యవస్థాపక దినోత్సవాన్ని సీపీఐ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్, సత్యనారాయణరెడ్డి భవన్‌లో ఘనంగా నిర్వహించారు. చాడ వెంకట్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పార్టీ పతకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విభజన రాజకీయాలు, మతం పేరుతో దేశంలో విధ్వంసం సష్టిస్తున్నారని ఆరోపించారు. కేంద్రపాలనలో రైతులు, కార్మికులు, విద్యార్థులు, యువత, మహిళలు, దళితులు, అణగారిన వర్గాల వారు దాడులకు గురవుతున్నారని అభిప్రాయపడ్డారు. రాజ్యాంగ వ్యవస్థలు, ప్రజాస్వామ్యం, లౌకికవాదాన్ని రక్షించుకునే బాధ్యత కమ్యూనిస్టులపైనే ఉందని, వాటిని రక్షించుకునేందుకు దేశవ్యాప్తంగా బలమైన పోరాటాలు నిర్వహించాలని చాడ వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. సీపీఐ కార్యదర్శి కె.నారాయణ, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్, ఈ.టి.నరసింహ, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్. ఛాయాదేవి, సీపీఐ సీనియర్ నాయకులు ప్రేమ్‌పావని, వెంకటేశం, కమతం యాదగిరి, స్టాలిన్, ఎండీ. సలీమ్, పడాల నళిని, సలీమ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220378
9912220379